క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపడమే లక్ష్యం

తాడిపత్రి అర్బన్: క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ జి.రవి, ఎంపీడీఓ రంగారావు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మూడో రోజు గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇది అందరూ పాల్గొనే గొప్ప క్రీడా పండుగన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇక నుంచి ఏటా క్రీడా సంబరాలు జరుగుతాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయికి మన క్రీడాకారులను పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షటిల్ ఆడుతున్న అధికారులు



కల్లూరులో కబడ్డీ ఆడుతున్న యువకులు

గ్రామస్థాయిలో ముగిసిన పోటీలు..

యాడికి: మండలంలోని ఉన్నత, నిట్టూరు, ఆదర్శ పాఠశాలలో మూడో రోజు నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు గురువారం గ్రామ స్థాయిలో పూర్తయినట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని 16 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 37 క్రికెట్ టీంలకు 3 రోజుల నుంచి క్రికెట్ పోటీలకు పోటీలు నిర్వహించగా అందులో 16 టీంలు విజేతలుగా నిలిచి మండల స్థాయి క్రికెట్ పోటీలకు ఎన్నికయ్యాయన్నారు. త్వరలో యీ జట్లకు మండలస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

గార్లదిన్నె: క్రీడల ద్వారా మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం మూడో మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయ పరిధిలోని ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరిగా జరిగాయి. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. ఎంఈఓ చంద్రనాయక్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ దామోదరమ్మ హెచ్‌ఎం వసుంధర పోటీలను పర్యవేక్షించారు.

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: ఎక్స్ వేదికగా సీఎం జగన్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మీద అవాస్తవాలతో కూడిన తప్పుడు పోస్టులు పెట్టిన టీడీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పీఎస్ నందు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గురువారం సీఐ రామసుబ్బయ్యను వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా నియోజకవర్గం కోఆర్డినేటర్ జయరామిరెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎండీ.ఖలీల్, పార్టీ నాయకులు కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ (స్వాతిరెడ్డి–టీడీపీ) ఐడీ ద్వారా కొందరు వ్యక్తులు సీఎం జగన్ ఎమ్మెల్యేలను పట్టించుకోవట్లేదని, కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వని కారణంగా స్థానిక ఎమ్మెల్యే ఈ పార్టీలో ఉండి చేసేదేమీ లేదని అంతరంగికులతో చెప్పినట్టు ఎక్స్, ఫేస్‌బుక్‌ల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని కోరారు. ఇది ముమ్మాటికీ పిరికిపందల చర్యగా వారు అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, పోలింగ్ బూత్ కన్వీనర్ మౌలా, వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు అంజి, వినోద్, హరి, సాయిరెడ్డి, చిన్నరాయుడు, అక్రమ్, రామాంజి, వెంకటేష్, నాగిరెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.



సీఐ రామసుబ్బయ్యకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం మృత్యుంజయ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు వాసు దేశ శర్మ బృందం కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, లక్ష్మి హోమం, రుద్ర స్వాహకార హోమం, సూక్త హోమం, వాసవీ మూల మంత్ర హోమం, మహా మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, నాగ సుదర్శన్, వాసవీ మహిళా మండల అధ్యక్ష, కార్యదర్శులు రాచమడుగు ఉమాదేవి, రాచమడుగు భాగ్యలక్ష్మి, కోశాధికారి కె. కృష్ణవేణి, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాయి వెంకటేష్, వెంకట్, జక్కా మహేష్ తదితరులు పాల్గొన్నారు.



గుత్తి వాసవీ ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుమ్మఘట్ట: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు, బాలింతలు, తలసీమియా వ్యాధిగ్రస్తులు, కిడ్నీ బాధితులకు రక్తం అవసరమన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి రక్తదాతలను ఫోన్‌ద్వారా అభినందించారు. అనంతరం రక్తదానం చేసిన 60 మంది రక్తదాతలకు అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాంకిశోర్, బాలాజీనాయక్, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఐఆర్‌సీఎస్ సభ్యుడు ఈరన్న, సీహెచ్‌ఓ మురళీధర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీటీపీ గోవిందు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు టీ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న దృశ్యం

జగనన్న ఉద్యోగ, కార్మికుల పక్షపాతి

గుంతకల్లుటౌన్: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల పక్షపాతి అని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్, వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఉద్యోగ, కార్మికులకు ఇవ్వని హామీలు కూడా అమలు చేసి అందరిలో సంతోషాన్ని నింపే దిశగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్లు సమ్మెబాట పట్టడం వల్ల చిన్నారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారని, వారి సమస్యలను సహృదయంతో అర్థం చేసుకోవాలని ఆయన మనవి చేశారు. ఉద్యోగ, కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, సమ్మెను విరమించి ప్రజాసంక్షేమ, అభివృద్ధికి పాటుపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, సీనియర్ నాయకుడు దశరథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

ఎరువులు, మందులు అందుబాటులో ఉంచండి

కణేకల్లు: రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, మందులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని డీఏఓ ఉమమహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం రాయదుర్గం నియోజకవర్గ వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీఈఓ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో డీఏఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఆధారం చేసుకుని అవసరమైన మందులను ముందుగా గుర్తించి ఆర్బీకేల్లో ఉంచాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అవసరమైన మేరకు ఎరువులను కూడా సిద్ధంగా ఉంచాలని, రైతులెవరూ ఇబ్బందులు పడకూడదన్నారు. ప్రభుత్వం జనవరిలో పీఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాలో జమా చేయనుందని ఈ లోపు పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రబీ ఈ–క్రాప్ బుకింగ్ పూర్తిస్థాయిలో జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన డీఏఓ ఈనెల 31 లోపు పక్కాగా ఈ క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓ అహమ్మద్ బాషా, డి.హిరేహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట ఏఓలు మహేంద్ర, శ్రవణ్‌కుమార్, నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వంద శాతం పూర్తి చేయాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వంద శాతం ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు. గురువారం కల్లూరులో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 746 ఇళ్లు పూర్తి కాగా 240 ఇళ్లు పునాదుల దశలో ఉన్నాయన్నారు. పునాది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఇళ్ల లబ్దిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసనాయక్

కనుల పండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీ సాయిఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి శేజ్‌హారతి చేపట్టారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు అనంతస్వామి, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో షిరిడీసాయి

థియేటర్‌లో కూల్‌డ్రింక్స్ దుకాణంపై కేసు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ థియేటర్‌లో తినుబండారాలు, శీతల పానీయాలు విక్రయిస్తున్న షాపులో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తుండడంతో గుంతకల్లు తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్ గురువారం రాత్రి ఆకస్మిక దాడుల నిర్వహించారు. అధిక ధరలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. 200 ఎంఎల్ కూల్‌డ్రింక్ బాటిల్ కొనుగోలు చేయగా పది రూపాయలు విలువ ఉండగా రూ.30కు విక్రయించారన్నారు. నిర్ణీత ధర కంటే అధికంగా ఎవరైనా వసూలు చేసే చర్యలు తీసుకుంటామన్నారు.



కేసు నమోదు చేస్తున్న అధికారి శంకర్

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పీహెచ్‌సీలో మరిన్ని రక్త పరీక్షలు చేసేందుకు చొరవ చూపింది. గురువారం కూడేరు పీహెచ్‌సీలో హెమటోలజీ అనలైజర్‌ను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చింది. ఈ మిషన్ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. ఈ యంత్రం ద్వారా రక్తంలో కణాల సంఖ్యను తెలుసుకోవచ్చని, ఎంసీహెచ్, టీసీ, డీసీ, హెచ్‌బీతో పాటు మరిన్ని పరీక్షలు ఇక్కడే చేసి రిపోర్టులు ఇస్తామని ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ తెలిపారు. ఇలాంటి పరీక్షలు ప్రైవేటుగా చేయించుకుంటే సుమారు రూ.1,200 వరకూ ఖర్చవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మిషన్ ఏర్పాటు చేయడం పట్ల మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు

శింగనమల: రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం తెలిపారు. శింగనమల, నలకంచెరువు, తరిమెల, గార్లదిన్నె, ఎర్రగుంట్ల పశువైద్యశాలల్లో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గడ్డి విత్తనాలు సబ్సిడీ పోను కేజీ రూ.23కు అందిస్తున్నామన్నారు. ఎకరాకు 15 నుంచి 20 కేజీల వరకు గడ్డి విత్తనాలు విత్తుకోవాలని, ఒకసారి విత్తుకుంటే నాలుగు నుంచి ఐదు కోతల వరకు వస్తుందన్నారు. ఎకరాకు 48 మెట్రిక్ టన్నుల గడ్డి ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు తీసుకొని తమ సమీప పశువైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

ముత్యాలపల్లకీలో ఊరేగిన వీరభద్రస్వామి

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో ఉన్న వీరభద్రస్వామిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ముత్యాలపల్లకీలో గురువారం రాత్రి ఘనంగా ఊరేగించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించిన ముత్యాలపల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ ఊరేగించగా భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సర్మాస్ హుసేనీ దర్గాలో ఫాతేహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

యల్లనూరు ఎస్‌ఐగా ధరణీబాబు



యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా ధరణీబాబు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణను తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ధరణిబాబును ఇక్కడికి నియమించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకి సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఎస్‌ఐ ధరణీబాబు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

'క్లాప్' ఆటోలకు చెత్త అందించండి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ పబ్లిక్ హెల్త్, నాన్ పీహెచ్ వర్కర్ల సమ్మె నేపథ్యంలో చెత్తాచెదారాన్ని క్లాప్ ఆటోలకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని వృథా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలని కోరారు. కార్మికుల సమ్మె సమయంలో మున్సిపాల్టీకి పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

జనవరి 3 నుంచి ముగ్గుల పోటీలు

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనవరి 3 నుంచి 10వ తేదీ వరకు పట్టణంలోని 37 వార్డుల్లోని అక్కచెల్లెమ్మలకు ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మెప్మా టీపీఆర్ఓ మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో అక్కచెల్లెమ్మలు పాల్గొనాలని విజేతలుగా నిలవాలని కోరారు. 37 వార్డుల్లో గెలిచే మొదటి ముగ్గురితో కలిపి ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన మొదట ముగ్గురికి ఒక తులం బంగారు, వాషింగ్‌మిషన్, ఫ్రిడ్జితో పాటు ఆకర్షణీయమైన బహుమతులను అందజేయనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు మెప్మా సీఎంఎం.భవాని, ఆయా వార్డులకు సంబంధించిన సీఓలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



ప్రభుత్వ స్థలంలో బండలు పాతిన దృశ్యం

యాడికి: పంచాయతీ స్థలం ఆక్రమించుకున్న వ్యక్తిపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యాడికి పంచాయతీ సర్పంచు అనురాధ, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న ఆర్‌డీటీ స్కూల్ వద్ద 15 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని మునగల రామాంజనేయులు కుమారుడు మునగల హరి ఆక్రమించుకుని బండలు పాతుకున్నారన్నారు. ఆ స్థలంలో ఉన్న బండలు తీసేయమని చెప్పినా హరి పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు.

మద్యం, నాటుసారా ధ్వంసం



నాటుసారా, మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

గుత్తి: స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటుసారాను గురువారం సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. పట్టణ శివారులోని కర్నూల్ రోడ్డులో సెబ్ సీఐ వరలక్ష్మి ఆధ్వర్యంలో మొత్తం 26 కేసుల్లో పట్టుబడిన మద్యం, నాటు సారాను నిప్పు పెట్టారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ అలీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి



బుర్నాకుంటలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. గురువారం క్రిష్టిపాడు, బుర్నాకుంట గ్రామాల్లో రెండో రోజు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ రాముడు, ఈఓపీఆర్డి నాగేశ్వరశాస్త్రి, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి కేంద్ర ప్రభుత్వం అందించిన 17 పథకాలను గురించి వివరించారు. గ్రామాలను అభివృద్ధి పరచడానికి కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులను తెలియజేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలను వివరించారు. అధికారులు నాగరాజు, గౌరీశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా కుష్టు సర్వే

గార్లదిన్నె: మండలంలో కుష్టు సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజుల పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా కుష్టుపై వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జనవరి 12 వరకు సర్వే సాగుతుందన్నారు. పురుషులను పరీక్షించడానికి పురుష వలంటీర్లు, మహిళలను పరీక్షించడానికి ఆశా వర్కర్లను టీంలుగా ఏర్పాటు చేశామని వివరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



సూర్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మిడుతూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సూర్యనారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామానికి చేరుకొని సూర్యనారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ కొట్నాలపల్లి హరినాథరెడ్డి, బీసీ విభాగం కార్యదర్శి జిల్లా పాశంరంగస్వామి, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, లక్కు రామచంద్రారెడ్డి, సర్పంచ్ రామాంజులరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపీనాథరెడ్డి, చిన్నవడుగూరు మధు, అశోక్, బోయ సుధాకర్, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం



పుట్లూరులో ఆరోగ్య శ్రీ కార్డులను అందిస్తున్న భూమిరెడ్డి సునీతమ్మ

పుట్లూరు: ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా పేదలు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చని శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్న ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవలను రూ.25 లక్షల వరకు పెంచడం ద్వారా చాలా మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇప్పటిలా అందాలంటే సీఎంగా మరోమారు జగనన్నే కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆమె శనగలగూడూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, సర్పంచ్ రమాదేవి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు

గార్లదిన్నె: అయోధ్య రామయ్య అక్షింతలు గురువారం గార్లదిన్నెకు చేరడంతో భక్తులు మేళతాళాలతో వాటిని ఊరేగించారు. అనంతరం వాటిని స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తితోనే ఉత్తమ జీవితం

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం సాధ్యమని హరిద్వార్ ట్రస్టు ప్రతినిధులు యోగా గురువులు శివాజీ, సందీప్ అన్నారు. గురువారం స్థానిక లలితకళాపరిషత్తులో మహా గాయత్రి యజ్ఞం చేశారు. హరిద్వార్ యోగా గురువులు 24 యజ్ఞ కుండలాల గాయత్రి మహా యజ్ఞ శృంకలాలను ఏర్పాటు చేసి, దంపతులతో గాయత్రీమాత యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. 29న సత్యసాయి జిల్లా ధర్మవరంలోని కొత్తపేట సాయిబాబా గుడి వద్ద భారీ ఎత్తున యజ్ఞాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి: పట్టణంలోని ఎస్‌వీ ఫర్టిలైజర్స్ షాపును గురువారం ఏడీఏ వెంకటరాముడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ.5,43,417 విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఎరువుల లైసెన్స్‌ను 30 రోజుల పాటు సస్పెండ్ చేశారు.